

# నా కళ్ళతో నాన్న

– లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**మా నాన్న** ఎన్ని నవలలు రాసారు, ఎన్ని ట్రావెలాగ్స్ రాసారు, ఎన్ని కథల పుస్తకాలు రాసారో అందరికీ తెలుసు. కానీ రైటర్‌గా స్థిరపడడానికి ముందు చేసిన ఉద్యోగాలు కేవలం తన సన్నిహితులకి మాత్రమే తెలుసు. 1986లో తన జీవితాన్ని, ఆదాయాన్ని రచనలకి అంకితమివ్వకముందు మా నాన్న ఆడిటర్. నేను ఇంజనియరింగ్ చదువుతుండగా "అబ్బా అకౌంట్స్ అట. నేనెమైనా అకౌంటెంట్ అవుతానా ఇంజనియరింగ్ చదివి?" అని మా అమ్మతో ఓసారి అన్నాను.

"ఫరవాలేదురా. అకౌంట్స్ ఈజీనే. నేనూ అకౌంట్స్ చదివాను, నాన్న అకౌంట్స్ చదివారు. అకౌంట్స్ నీ బ్లడ్‌లోనే ఉంది" అని ప్రోత్సహించడం నాకు ఇంకా గుర్తు. బహుశా మా నాన్న రైటర్ అయ్యుండకపోతే నేను ఈ కాలమ్ రాసే బదులు ప్రాఫిట్ అండ్ లాస్ కాలమ్స్ రాస్తుండేదాన్నేమో.

డిగ్రీ సంపాదించాక మా నాన్న పెంగ్విన్ టెక్స్‌టైల్స్ లిమిటెడ్‌లో ఫిబ్రవరి 1970 నుండి మార్చి 1971 వరకు అకౌంట్స్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చెయ్యడానికి హైదరాబాదు వచ్చారు. ఆ రోజునుండి ఈ రోజువరకు అదే ఊళ్ళో స్థిరపడడంతో మేముగ్గురం అక్కడే పెరిగాము. మా అమ్మని తను మొదటిసారి కలిసింది కూడా హైదరాబాద్‌లోనే.

ఆ తరువాత 1971 ఏప్రిల్ నుండి నవంబర్ వరకు జ్యోతి లిమిటెడ్‌లో బ్రాంచ్ అకౌంటెంట్‌గా సికింద్రాబాదులో పని చేసారు. 1971 డిసెంబర్ నుండి 1972 సెప్టెంబర్ వరకు ఫేక్టరీ అకౌంటెంట్‌గా వరంగల్‌లో పని చేసిన మా నాన్న ప్రైవేట్ కంపెనీస్‌ని వదిలేసారు.

సెప్టెంబర్ 1972 నుండి అక్టోబర్ 1986 వరకు మెంబర్ ఆడిట్ బోర్డ్ అండ్ ఎక్స్ ఒఫీషి డైరెక్టర్ పబ్లిక్ అకౌంట్స్ ఆడిటర్‌గా పనిచెయ్యడంతో మా నాన్న నైన్ టు ఫైవ్ ఉద్యోగాలు ముగిసాయి. సెంట్రల్ గవర్నమెంట్ జాబ్‌ని అందరూ చాలా ఇష్టపడతారు. కాంపెటీషన్ కూడా ఎక్కువగా ఉంటుందన్న సంగతి అందరికీ తెలిసిందే అయినా మా నాన్న రాజీనామా చెయ్యడానికి వెనక కారణాన్ని ఇదివరకటి ఎపిసోడ్‌లో వివరించాను. ఇంట్లో చంటిపిల్ల ఉండగా ఉద్యోగాన్ని వదిలేసి ఫుల్ టైం రైటర్ అవ్వాలన్న ఆలోచన రావడమే

గొప్ప. అందుకు మా అమ్మ ఎంతో సహకరించి తన వంతు కృషి చేసింది. డబ్బు గురించో, నలుగురు ఏమనుకుంటారో అన్న ఆలోచనలను దగ్గరికి రానివ్వకుండా ముందడుగు వెయ్యాలంటే ఎంత శక్తి కావాలో నేను ఊహించగలను.

ముగ్గురు పిల్లలను పెంచుతూ, అత్తగారిని చూసుకుంటూ, బుక్స్ ఆర్డర్స్, పబ్లికేషన్స్ పనులు, మొదలుగున్నవి మా అమ్మ మాత్రమే చెయ్యగలదు.

అంతేకాక మా నాన్న రైటింగ్ బావుండక పోవడంతో మా అమ్మ వాటిని ఫెయిర్ కాపి చేసేది. అలా మా నాన్న రాసిన ప్రతీ కథకి ప్రతీ పుస్తకానికి, ప్రతీ వాక్యానికి ఫస్ట్ ఆడియన్స్ మా అమ్మ. కనుక పుస్తకాలు రాసేది మా నాన్నే అయినా, అందులో మా అమ్మ శ్రమకూడా ఉంది. ఈ నిజాన్ని దాచకుండా మా నాన్న ఎన్నోసార్లు, ఎంతోమందికి "మా ఆవిడ వల్లే చెయ్యగలుగుతున్నాను" అని నా ముందే చెప్పారు. మా నాన్న చేసిన ఆఖరి 'ఉద్యోగం' 1988లో ఆరునెలలపాటు 'స్రవంతి'కి పార్ట్ టైం ఎడిటర్‌గా ఉన్నారు.

నేను రోజుకి పద్నాలుగు గంటలు పనిచెయ్యడం మొదలుపెట్టాక "యు ఆర్ వర్క్ హాలిక్" అని కొంతమంది ఫ్రెండ్స్ అనేవారు. "మీ ఇంట్లో అందరూ అంతేనా?" అని ఎవరో అడిగేంతవరకు 'నేను వర్క్ హాలిక్' అనే భావించేదాన్ని. నిజానికి. ఈ రోజు వరకు మా నాన్న చేతిలో పెన్, పేపర్ లేదా పుస్తకం లేకుండా నేను ఒక్క నిమిషం కూడా చూడలేదు.

పోస్ట్ ఆఫీస్, బ్యాంక్, ఆర్డర్స్ పనులు, ఏదీ లేకపోతే వంట - మా అమ్మ ఖాళీగా కూర్చునేది కేవలం ఉదయం కాఫీ తాగే పదిహేను నిమిషాలు మాత్రమే. వాళ్ళతో పోలిస్తే నేను బద్దకస్తురాలికిందే వస్తాను. పనులు బాధ్యతలు పెరిగినప్పుడు, సమయం కరువైనప్పుడు, మాఅమ్మ, నాన్నే నాకు స్ఫూర్తి. వారంత డెడికేషన్ మా ముగ్గిరిలో కావ్యకి వచ్చింది.

ఓసారి హ్యూస్టన్‌లో కావ్య ఫ్రెండ్ సెసీ ఇంటికి వచ్చినప్పుడు మా నాన్న బుక్ చదవడం గమనించి "మిస్టర్ మల్లాది, యు ఆర్ ఆల్వేస్ రీడింగ్ సంథింగ్, వై?" అని అడగడం విన్నాను. "సెసీ, ఇఫ్ యు వాంట్ టు టార్చర్ మై డేడ్, జస్ట్ టేకవే హిజ్ బుక్స్ అండ్ పేపర్స్" అని నేను బదులివ్వడం మా నాన్నని నవ్వించింది.

"మీ నాన్న ఇంకా రాస్తున్నారా?" అని పుస్తకాలకు దూరమైన ఒకప్పటి పాఠకులు నన్ను అడుగుతుంటారు. "యా" అని బదులిస్తాను. ఏ పనైనా మూడునెలలు చేస్తే అలవాటుగా మారుతుందంటారు. మరి ఏళ్ళ తరబడి చేస్తే?

మా పెదనాన్న బాంక్ మేనేజర్‌గా పనిచేసినప్పుడు సెలవుల్లో నన్ను కూడా తీసుకెళ్ళేవారు. అదేవిధంగా, నా ఫ్రెండ్స్ కొన్నిసార్లు వాళ్ళ నాన్నలతో ఆఫీసుకి వెళ్ళేవారు. రైటర్ అవ్వడంతో మా నాన్న మమ్మల్ని స్టోరీ డిస్కషన్స్‌కి, షూటింగ్స్‌కి అప్పుడప్పుడూ తీసుకెళ్ళేవారు. డిస్కషన్స్ జరుగుతున్న సమయంలో మమ్మల్ని అసిస్టెంట్ డైరెక్టర్స్ ఆడించేవారు. మేము ఎంత అల్లరి చేసినా వాళ్ళు పాపం ఏమీ అనలేకపోయేవారు. ఎంత గొడవ చేసినా "ఒక్క అరగంటమ్మా. అయిపోతుంది" అని మా నాన్న చాలా సహనంగా చెప్పేవారు. 'ష్ గప్ చుప్' షూటింగ్‌లో మాత్రం అసిస్టెంట్ డైరెక్టర్స్‌తో పాటు భానుప్రియ కూడా మమ్మల్ని ఆడించారట.

ఓసారి మా అమ్మ ఇంట్లో లేని సమయంలో మా నాన్న షూటింగ్‌కి వెళ్ళాల్సి వచ్చినప్పుడు కావ్యనికూడా తీసుకెళ్ళారు. అప్పుడు కావ్యని ఆడించిన అసిస్టెంట్ డైరెక్టర్ పూరి జగన్నాథ్. తిరిగి వారిద్దరూ కలిసింది దాదాపు పదిహేనేళ్ళు గడిచాక 'జ్యోతిలక్ష్మి' సినిమా ప్రివ్యూ రోజు. అప్పుడు నాతో పాటు ఫ్లోరిడా నుండి నా ఫ్రెండ్స్ హైదరాబాదుకి వచ్చారు. భాష రాకపోయినా, సబ్ టైటిల్స్ లేవన్నా వాళ్ళూ సినిమాకి రావడానికి ఇష్టపడ్డారు. మొదట్లో ఏదో షార్ట్ ఫిల్మ్ అని భావించామని, ఇంటర్వెల్‌కి వచ్చేసరికి అది ఫీచర్ ఫిల్మ్ అని అర్థమైందని అన్నారు. అందులో నటించిన వారు, సినిమాకి పనిచేసినవారు మా నాన్నని గౌరవించడం చూసి "యు నెవర్ టోల్డ్ మి ఎబౌట్ యువర్ డేడ్" అని ఆశ్చర్యపోయారు. "లిపిస్ డేడ్ ఈజ్ వెరీ డౌన్ టు అర్త్" అని ఈ రోజుకీ వాళ్ళ ఫ్రెండ్స్‌తో చెప్తుంటారట.

నా ఫ్రెండ్ కాశ్యప్ డైరెక్టర్ అవ్వాలనుకున్నప్పుడు తన షార్ట్ ఫిల్మ్‌లు చూసి మా నాన్న ఇచ్చిన టిప్స్ ఎంతో ఉపయోగపడ్డాయని చెప్పాడు. సినిమాలకి సంబంధించినవారు ఇంటికి వచ్చినప్పుడు "నాన్న, కాశ్యప్‌ని పిలవనా?" అని నేను రెండుసార్లు అడిగాక, "వద్దులే

వాళ్ళేమనుకుంటారో అని మా అమ్మ మొహమాటపడినా, మూడోసారి నుండి "కాశ్యప్‌ని పిలుస్తావా?" అని మా నాన్నే అడిగేవారు. అలా కాశ్యప్ కలిసిన కొంతమంది డైరెక్టర్స్ - వంశీ, సుమన్ పాతూరి, పూరీజగన్నాథ్, రాజమౌళి.

కావ్యకి గుర్తుందో లేదో తెలియదు కానీ తను చిన్నప్పుడు నాగార్జున ఫాన్. ఎందుకంటే, ఓ సారి "నాన్నా నాకు నాగార్జునని చూడాలని ఉంది" అని చెప్పిందట. అప్పుడు కావ్య వయసు ఏడు. మా నాన్న ఏదో డిస్కషన్‌లో ఉండగా ఓ రోజు అన్నపూర్ణా స్టూడియోస్‌కి రమ్మని, అక్కడ తన ఫ్రెండ్‌కి ఇన్‌ఫార్మ్ చేసారట. ఆ రోజు 'రక్షణ' షూటింగ్ మధ్యలో నాగార్జున కావ్యని పలకరించారు.

మరోసారి తను ఏడోతరగతిలో ఉన్నప్పుడు "బ్రహ్మానందంని చూడాలనుంది" అని మా నాన్నకి చెప్పిందంట. 'హేండ్స్ అప్' షూటింగ్ జరుగుతుండగా మా నాన్న కావ్యని తీసుకెళ్ళి "మా అమ్మాయి మిమ్మల్ని చూడాలందండి" అని బ్రహ్మానందంతో చెప్పారట. దానికి ఆయన "చూడమ్మా, బాగా చూడు. కనపడుతున్నానా, లేక లైట్ ఆన్ చెయ్యాలా?" అని వెటకారంగా అడగడంతో కావ్య బాగా హర్ట్ అయ్యి జీవితంలో మళ్ళీ ఏ సెలబ్రిటీనీ కలవకూడదనుకుంది. నేను ఆ నిర్ణయాన్ని నచ్చిన వ్యక్తిని కలవకముందే తీసుకున్నాను.

ఈ రోజుకీ మా అమ్మకి కోపం తెప్పించే విషయం బయటకి వెళ్ళేముందు పడుకోవడం. యధావిధిగా ఈ విషయంలో మా అమ్మని ఎంతో ఇబ్బంది పెట్టాను. దీన్ని కొంత వివరించాలి. బయటికి వెళ్ళడానికి తయారవ్వాలి అనగానే అంతా ముందు నన్నే రెడీ చేసేవారు. పదినిమిషాల్లో 'నేనే రెడీ' అన్న గంటకి కానీ బయలుదేరేవాళ్ళం కాదు. ఈలోపు బోర్ కొట్టి పడుకునేదాన్ని దాంతో కారు ఎక్కేసరికి నా జుట్టు చింపిరిగా ఉండేది.

"ఎవరైనా చూస్తే నేను స్టెప్ మదర్ అనో, లేక నువ్వు పనిపిల్లవనో అనుకుంటారు" అని మా అమ్మ కోప్పడేది.

"అమ్మా, బోర్ కొడుతుంది. ఇంటికెళ్దాం" అని రాత్రి తొమ్మిదిదాటగానే పేచీ మొదలుపెట్టేదాన్ని. నా బాధ గమనించి జంధ్యాలగారు, మా చుట్టాల్లో కృష్ణ అనే సి.ఎ నాతో కబుర్లు చెప్పడానికి, లేదా ఆడించే ప్రయత్నం చేసేవారు. అందరికన్నా నేను ఎక్కువ విసిగించింది చలసాని ప్రసాద్‌రావుగారిని. ఆయన చక్కటి ఆర్టిస్ట్ అని అందరికీ తెలిసిన విషయమే. కానీ నా జీవితంలో నేను ఆయన్ని మించిన ఆర్టిస్ట్‌ని చూడలేదు. కలిసిన ప్రతీసారి ఓ చిన్న నోట్ బుక్‌ని, పెన్‌ని తీసుకొచ్చేవారు. ఓ పేపర్ మీద పిచ్చి గీతలు గీయమనేవారు. నా పిచ్చి గీతలకి ఆయన గీతలు చేర్చి ఓ అందమైన బొమ్మగా మలిచేవారు. "ఇంకోటి గీయరా.. ఇంకోటి" అంటూ కలిసిన ప్రతిసారీ విసిగించినా ఆయన చిరునవ్వు ఎప్పుడూ చెరగలేదు. ఓసారి ఆయన నోట్‌బుక్‌లో పేపర్ ఖాళీ లేక నాప్కిన్ మీద ఓ సీతాకోక చిలుకని గీయడం నాకు ఇంకా గుర్తు. "బయటికి వచ్చినప్పుడు గొడవ చెయ్యకు" అని మా అమ్మ మందలించినా, "ఫరవాలేదులే. దానికి తోచట్లేదనుకుంటా" అంటూ తన ఫ్రెండ్స్ పక్కన ఉన్నా మా నాన్న నాకు కబుర్లు చెప్పడం, "లిపికి నిద్రొచ్చిందండి, ఇంటికి వెళ్తాం" అని మా నాన్న సంభాషణ మధ్యలో అనడం నాకు బాగా గుర్తు. ఎలాంటి సందర్భమైనా ఎదుట ఉన్నది ఎవరైనా, పిల్లలకి ప్రాముఖ్యతని ఇవ్వడం మా నాన్న ఈ రోజుకీ మానలేదు. పిల్లలపట్ల అంత ప్రేమ, సహనం ఉండడం కేవలం మా నాన్నకే సాధ్యం.

ఓ రోజు ఆడుకుంటుండగా నా ఫ్రెండ్‌కి దెబ్బ తగిలింది. వెంటనే వాళ్ళ అమ్మ ఫస్ట్‌ఎయిడ్ కిట్‌తో బయటకి వచ్చారు. "నువ్వెప్పుడైనా ఫస్ట్‌ఎయిడ్ చేసావా నాకు?" అని మా అమ్మతో నేను పోట్లాడాను.

"వాళ్ళ నాన్న డాక్టర్ కాబట్టి ఆంటీ ఫస్ట్ ఎయిడ్ చేస్తారు. మీ నాన్న రైటర్ కాబట్టి ఏం కాదులేమ్మా అని కథలు చెప్తాను" అని బదులిచ్చింది.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story